క్లుప్తంగా

303 మందికి హెచ్ఐవీ వ్యాక్సిన్లు



పెద్దాపురం ఆసుపత్రిలో ఎయిడ్స్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

పెద్దాపురం: స్థానిక ఏరియా ఆసుపత్రి పరిధిలో చికిత్స పొందుతున్న 303 మంది హెచ్ఐవీ రోగులకు వ్యాక్సిన్ వేసినట్టు పెద్దాపురం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఐసీటీసీలో ఆయా రోగుల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్లు ఉమామహేశ్వరి, ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హెచ్ఐవీ బాధితులకు మందులు పంపిణీ చేశామన్నారు. ఇక నుంచి బాధితులకు ప్రమాదం లేకుండా వ్యాక్సిన్ వేయించడం జరుగుతుందన్నారు. ఎవరైనా హెచ్ఐవీ బాధితులు మిగిలిపోయి ఉంటే ఆసుపత్రిలోని ఐసీటీసీ విభాగంలో బాధితులకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నమణి, సీపీఎం బాలాజీ, డీసీ బుజ్జిబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, చంద్రమౌళి, జ్యోతి, ఎల్టీ శ్రీనుబాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గోతులు పూడ్చరు.. ప్రమాదాలు తప్పవు



గోతిలో పడిపోయిన మహిళ

సామర్లకోట: రోడ్లపై ఉన్న గోతుల్లో వర్షపునీరు చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక సీబీఎం సెంటర్‌లోని కల్వర్టుకు రెండు వైపులా గోతులు ఏర్పడడంతో వర్షపునీరు చేరింది. దాంతో కల్వర్టు మీదుగా రాకపోకలు సాగించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. సామర్లకోట పోలీసుస్టేషన్ మీదుగా జగనన్న కాలనీ, ప్రతిపాడుకు రాకపోకలు సాగించే వారు ఈ రోడ్డుపై ఉన్న కల్వర్టును దాటవలసి ఉంది. అయితే శుక్రవారం ఓ మహిళ ఈ గోతిలో నడిచి వెళుతూ జారి గాయపడింది. ఈ సంఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. స్థానికులు ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రతి రోజూ ఈ గోతుల్లో అనేక మంది పడిపోతున్నారని, వారికి స్థానిక ఆస్పత్రికి తరలిస్తున్నామని ఆ ప్రాంత యువకులు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గోతులను పూడ్చే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డివిజన్‌లో 80 శాతం పన్నుల వసూలు

ప్రత్తిపాడు: పెద్దాపురం డివిజన్‌లో 80 శాతం పన్నులు వసూలు చేసినట్టు పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలమణి తెలిపారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్ కార్యక్రమాలను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని 213 గ్రామ పంచాయతీల్లో రూ.20,02,22,865 పన్నులు వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.17,52,23,769 వసూలు చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా మిగిలిన రూ.4,55,09,162 బకాయిలను వసూలు చేస్తామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను డిమాండ్ నోటీసుల్లో తప్పులను సరిచేయడం, ఎస్సైన్‌మెంట్‌లోని నంబర్లను సరిచేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 31 వరకూ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం చారిత్రక గౌరవాన్ని కాపాడాలి

పెద్దాపురం: పట్టణంలో వ్యభిచారాన్ని పూర్తి స్థాయిలో రూపుమాపి, చారిత్రక పెద్దాపురం గౌరవాన్ని కాపాడాలని వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం సీపీఎం పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జ్యోస్యుల కృష్ణబాబు, సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పెద్దాపురం పట్టు, పాండవుల మెట్ట వంటి చారిత్రక అంశాలు ఉన్నాయని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యభిచార కేంద్రాలను గుర్తించి, 24 గంటలూ పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దాపురం చరిత్రను కాపాడేందుకు పోలీసులు, అధికారులు, రాజకీయ నేతలు, ప్రజలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, శ్రామిక మహిళ నేత దాడి బేబీ, సీఐటీయూ మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, సీపీఎం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడి చదువులు

- 90 మంది విద్యార్థులకు నలుగురే ఉపాధ్యాయులు
- బి.కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన అడ్మిషన్లు
- ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు ఇక్కట్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



బి.కొత్తూరు ఎంపీయూపీ స్కూల్

పిఠాపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడుతో కళకళలాడిన ప్రభుత్వ పాఠశాలలు నేడు కళా విహీనంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రైవేటు, కార్పొరేట్ విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సర్కారీ పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యా బోధన కుంటుపడుతోంది. చదువు చెప్పే వారు లేనప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ఎందుకు చదివించాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

తెలుగు, హిందీ సబ్జెక్టు టీచర్లు లేక అవస్థలు

పిఠాపురం మండలంలోని బి.కొత్తూరు గ్రామం సామాజికంగా, రాజకీయంగా నియోజకవర్గంలో పేరొందిన గ్రామం. విద్యావంతులు ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆ గుర్తింపు కాలగర్భంలో కలిసిపోతోంది. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకు నలుగురే ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఇంగ్లిషు, గణితం చెప్పేవారు మాత్రమే ఉండగా తెలుగు, హిందీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరు. దీంతో కనీసం మాతృ భాష చెప్పే వారు లేక తమ పిల్లల చదువులు కుంటుపడుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులు సెలవు పెడితే..

గతంలో ఈ పాఠశాలలో 75 మంది విద్యార్థులకు 8 మంది ఉపాధ్యాయులు ఉండేవారు. ప్రస్తుతం పిల్లల సంఖ్య 90కి పెరగగా ఉపాధ్యాయులు మాత్రం నలుగురికి తగ్గిపోయారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను పెంచాల్సిన విద్యా శాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తుండడంతో రోజురోజుకూ ఇక్కడ విద్యాబోధన కుంటుపడుతోంది. ప్రస్తుతం ఈ పాఠశాలకు ఇద్దరు ఎస్‌జీటీలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురే ఉన్నారు. వీరిలో ఎవరైనా అవసరం వచ్చి సెలవు పెడితే ముగ్గురు లేక ఇద్దరే ఉంటున్నారు. దీంతో పిల్లలను కాపలా కాయడం తప్ప విద్యా బోధన చేసే అవకాశం లేకుండా పోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. వెంటనే తగినంత మంది ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన కుంటుపడకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణను వివరణ కోరగా తమ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తవమే అన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.


ఎవరూ పట్టించుకోవడం లేదు



మా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది. విద్యార్థుల సంఖ్య పెరుగుతుండగా ఉపాధ్యాయులు తగ్గిపోతున్నారు. సమస్యను పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఇటీవల నిర్వహించిన మెగా తల్లిదండ్రుల సమావేశంలో దీనిపై గట్టిగా అడిగితే చూస్తాం చేస్తాం అన్నారు తప్ప ఉపాధ్యాయులను నియమించలేదు. స్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో పిల్లలకు రక్షణ కరువైంది. ప్రహరీ నిర్మించాలని అడిగినా ఎవరు పట్టించుకోలేదు. దీంతో తాత్కాలికంగా వలతో రక్షణ ఏర్పాటు చేసుకున్నాం. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలోనే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇలా ఉంటే ఎలా ? తెలుగు, హిందీ సబ్జెక్టులను బోధించకపోతే విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారు ? వచ్చే నెల నుంచి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. చెప్పేవారు లేనప్పుడు వీళ్లు పరీక్షలు ఎలా రాయాలో విద్యాశాఖాధికారులే చెప్పాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించపోతే అందరూ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయే ప్రమాదం ఉంది.

– పులుగు రాంబాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, బి.కొత్తూరు

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బచ్చు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోనాలు

స్థానిక బచ్చు ఫౌండేషన్ వారసుడు బచ్చు అవినాష్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మేళతాళాల నడుమ బోనాలు ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం బచ్చు ఫౌండేషన్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా సుమారు 300 మంది మహిళలు బంగారు కలశాలు, బోనంతో భారీ ప్రదర్శన నిర్వహిస్తూ మరిడమ్మ అమ్మవారి గుడికి చేరుకున్నారు. అక్కడ బచ్చు అవినాష్ దంపతులు మహా అఖండ దీపం సమర్పణ అనంతరం ముత్తైదువలకు పసుపు, కుంకుమ, చీర, తీర్థ ప్రసాదం అందజేశారు. అవినాష్ దంపతులు ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సముద్ర నాచు పెంపకంపై నేడు శిక్షణ

కొత్తపల్లి: స్థానిక సురక్ష ప్యాలస్‌లో శనివారం కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన స్వయం శక్తి సంఘ సభ్యులకు సముద్ర నాచు పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్టు మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభవుతుందన్నారు. కొత్తపల్లి, తొండంగి మండలాల్లోని స్వయం శక్తి సంఘ సభ్యులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భవనం పైనుంచి పడి కార్మికుడికి గాయాలు

కొత్తపల్లి: భవనం పైనుంచి కింద పడి ప్రమాదవశాత్తూ కార్మికుడికి గాయాలైనట్టు శుక్రవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఒడిశాలోని రాయగడ జిల్లా గణత్రీ మండలానికి చెందిన తపన్ సబర్ కేఎస్ఈజెడ్‌లోని సంధ్యా ఆక్వా రొయ్యల శుద్ధి పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గురువారం పరిశ్రమలో హాస్టల్ రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిశ్రమ సిబ్బంది చికిత్స నిమిత్తం కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

ల్యాప్‌టాప్ చోరీ

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై నిద్రించిన ఓ వ్యక్తి ల్యాప్‌టాప్ చోరీకి గురయింది. విశాఖపట్నం నుంచి శుక్రవారం తెల్లవారుజామున ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోటలో తెల్లవారుజామున 2.43 నిమిషాలకు దిగి ప్లాట్‌ఫాంపై ఉన్న బల్లపై నిద్రించగా ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్ చోరీకి గురయినట్లు కాకినాడకు చెందిన తెలగతోటి సుబ్బారావు స్థానిక రైల్వే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో ల్యాప్‌టాప్ తో పాటు కొన్ని రకాల పరికరాలు, ఆధార్, పాన్, బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుతో పాటు విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

శ్రావణం.. శుభప్రదం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు

పిఠాపురం: శ్రావణ మాసం ప్రారంభమైంది. శుభప్రదమైన మాసంలో తొలి శుక్రవారం కావడంతో ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పాదగయ పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. మహిళలు వరలక్ష్మి వ్రతాలు భక్తి ప్రవత్తులతో నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలోని పురుహూతిక, రాజరాజేశ్వరి అమ్మవార్ల సన్నిధిలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు చేశారు. అనంతరం దేవాలయంలోని కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి, పురుహూతిక అమ్మవార్లు, దత్తాత్రేయ స్వామి, సాయిబాబాలను మహిళలు, భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేష అలంకారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిటకిటలాడిన ఆలయాలు

కొత్తపల్లి: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పండితులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలోని దుర్గాదేవి, కొత్తదొడ్డిలో బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం, గొర్స, ఉప్పాడ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, కొత్తపల్లిలోని బాలిత్రిపుర సుందరి సమేత రాజేశ్వరిస్వామి, ఉప్పాడ, గొర్స, మూలపేట, యండపల్లిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో పురూహూతికా అమ్మవారు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపురసుందరి అమ్మవారు

ఆలయాలకు శ్రావణ శోభ

సామర్లకోట: శ్రావణ మాసం అమ్మవార్లకు ప్రీతికరమైన శుక్రవారం ప్రారంభం కావడంతో అమ్మవారి ఆలయాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. స్థానిక బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త విజయకనకదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి పూజలు ప్రారంభం అయ్యాయి. అదే విధంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీదేవికి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. అయోధ్యరామపురంలోని కనకదుర్గ ఆలయం, భాస్కర్‌నగర్‌లోని కనకదుర్గ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారి ఆలయాలను విద్యుత్తు దీపాలంకరణలు చేశారు. శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా మహిళలు ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆగస్టు 8న మహిళల ఇళ్ల వద్ద పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నారు. ఈ మేరకు రకరకాల పిండి వంటలు, పండ్లు అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. ఇళ్ల వద్ద పూజల అనంతరం మహిళలు అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు మేనేజర్ ఎం.రాజేశ్వరి అన్నారు. వీకే రాయపురం పంచాయతీ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జన సురక్ష పథకంలో ఏడాదికి రూ.20 బీమా ప్రీమియంగా చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. ఈ బీమా పాలసీ కలిగిన వారు ప్రమాదవశాత్తూ మరణించినా, పూర్తిగా అంగవైకల్యం చెందితే రూ.రెండు లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష బీమా వస్తుందన్నారు. దీనికి 18 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నవారికి సులభంగా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. అయితే ఈ పథకాన్ని అంగీకరిస్తూ సంతకం చేస్తే ప్రతి ఏటా బ్యాంకులో నిల్వ నుంచి బీమా ప్రీమియం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు ఖాతాలో తగిన నిల్వ ఉండాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ రాజేశ్వరి

అదే విధంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన 18 నుంచి 50 ఏళ్ల కలిగిన వారు ప్రీమియంగా ఏడాదికి రూ.436 చెల్లించాలన్నారు. పాలసీదారుడు మరణిస్తే నామినీకి బీమా మొత్తం లభిస్తుందని చెప్పారు. బ్యాంకుకు అంగీకార పత్రం ద్వారా ఏటా బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం డెబిట్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి, రైతు సంఘ నాయకుడు గొల్లపల్లి నానాజీ, రైతులు పాల్గొన్నారు.

ఈ నీటిని తాగేదెలా..?

- కుళాయిల ద్వారా బురద నీరు
- పైపులైన్ల లీకులే కారణం

సామర్లకోట: మున్సిపాలిటీ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు గత మూడు రోజులుగా బురద నీరు వస్తున్నా అధికారులు స్పందించడం లేదు. శుక్రవారం కుళాయిల ద్వారా బలుసులపేటలో బురద నీరు వచ్చిందని ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులకు తాగునీటి సమస్యను వివరించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించవలసిన అధికారులు స్పందించడం లేదన్నారు. గత మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు లేకపోవడంతో ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడానికి అవకాశం లేని పరిస్థితి ఏర్పడిందని ఆయన వాపోయారు. ప్రధాన పైపులైన్ల లీకులు కారణంగానే మున్సిపల్ కుళాయిల నుంచి బురద నీరు వస్తుందని ఆయన ఆరోపించారు. దీనిపై కమిషనర్ శ్రీవిద్యను వివరణ కోరితే ఒక గంట తరువాత మంచి నీరు వస్తుందని సమాధానం ఇచ్చారన్నారు. లీకులను గుర్తించడంలో అధికారులు, సిబ్బంది వైఫల్యం చెందుతున్నారన్నారు. పట్టణ పరిధిలో 15 సచివాలయాలు ఉండగా ప్రతి సచివాలయంలోనూ ఇంజినీరింగ్ అసిస్టెంటు ఉన్నారని వారు ప్రతి రోజూ వార్డుల్లో పర్యటించే విధంగా చేస్తే లీకులు గుర్తించడానికి అవకాశం ఉంటుందని హరిబాబు తెలిపారు. ఫిల్టర్ బెడ్‌ను ప్రతి రోజు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేస్తే సమస్యలు గుర్తించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో అతిసార వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు తగుచర్యలు తీసుకోవాలన్నారు.



మున్సిపల్ తాగునీటి కుళాయి నుంచి వచ్చిన బురద నీరు

ప్రకృతి సాగుతో అధిక ఆదాయం



గొర్సలో వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ అన్నారు. మండలంలోని గొర్సలో ప్రకృతి సాగుపై నియోజకవర్గంలోని గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులకు మండల వ్యవసాయ అధికారి జోగిరాజు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కూరగాయల పెంపకం, తక్కువ పొలంలో ఎక్కువ రకాల పంటలు వేసి అధిక ఆదాయం పొందే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎలియాజర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పండించే పంటలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు. గొర్సకు చెందిన ఓ రైతు 20 సెంట్ల భూమిలో 20 రకాల పండ్లు, కూరగాయలను పండిస్తూ అధిక ఆదాయాన్ని పొందుతున్నట్టు తెలిపారు. శిక్షణ పొందిన వ్యవసాయ సహాయకులు గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో అలజడి

- కోతకు గురవుతున్న గృహాలు
- భయాందోళన చెందుతున్న మత్స్యకారులు



ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న అలలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో తీర ప్రాంతంలో అలల ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. కెరటాల ఉధృతికి మత్స్యకారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులగా సముద్రపు అలలు ఎగసి పడడంతో మత్స్యకారుల గృహాలు కోతకు గురవుతున్నాయి. అలలు తాకిడితో గంగపుత్రుల ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. తీరప్రాంత రక్షణగా వేసిన జియోట్యూబ్ పూర్తిగా ధ్వంసం కావడంతో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. ఇళ్లతో పాటు విద్యుత్ స్తంభాలు, రోడ్లు, వృక్షాలు సైతం సముద్ర గర్భంలో కలిసి పోతున్నాయి. ఉప్పాడ– కాకినాడ బీచ్‌రోడ్డులో సముద్రపు అలలు తీరాన్ని తాకుతుండడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.



తీరప్రాంతంలో కూలిపోయిన మత్స్యకారుల గృహాలు



కూలిపోయేందుకు సిద్ధం ఉన్న మత్స్యకార గృహాలు